మానవతా దృక్పథంతో వ్యవహరించాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌ యాదవ్‌

సికింద్రాబాద్‌: ఫుట్‌పాత్‌ వ్యాపారుల విషయంలో ప్రభుత్వం, అధికారులు మానవతా దృక్పథంతో వ్యవహరించాలని మాజీ మంత్రి, ఎమ్మెల్యే శ్రీనివాస్‌ యాదవ్‌ అన్నారు. సికింద్రాబాద్‌లోని జీహెచ్‌ఎంసీ జోనల్‌ కార్యాలయంలో ట్రాఫిక్‌ పోలీసులు, అధికారులతో సోమవారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎన్నోఏళ్లుగా చిరు వ్యాపారులు ఫుట్‌పాత్‌లు, తోపుడు బండ్లపై వ్యాపారాలు చేసుకుంటూ కుటుంబాలను పోషించుకుంటున్నారన్నారు. వారి వ్యాపారాలు తొలగిస్తే జీవనోపాధి కోల్పోయి రోడ్డున పడుతారన్నారు. ట్రాఫిక్‌, ప్రజలకు ఇబ్బందుల్లేకుండా వ్యాపారం కొనసాగించేలా చూడాలన్నారు. నియోజకవర్గ పరిధిలో క్షేత్రస్థాయిలో పర్యటించి సమస్య పరిష్కారానికి తీసుకోవాల్సిన చర్యలపై ఫుట్‌పాత్‌ వ్యాపారులకు ఆదేశాలు, పలు సూచనలు చేయాలని నిర్ణయించారు. అంతేగాకుండా అర్హులైన ఫుట్‌పాత్‌ వ్యాపారులకు ఫొటోతో కూడిన గుర్తింపు కార్డులు అందించాలని సూచించారు. సమావేశంలో జోనల్‌ కమిషనర్‌ రవి కిరణ్‌, ట్రాఫిక్‌ ఏసీపీ శంకర్‌రాజు, బేగంపేట కార్పొరేటర్‌ టీ. మహేశ్వరి, డిప్యూటీ కమిషనర్‌ సమ్మయ్య, టౌన్‌ప్లానింగ్‌ ఏసీపీ సుష్మిత, బేగంపేట, మహంకాళి, గోపాలపురం ట్రాఫిక్‌ ఇన్‌స్పెక్టర్లు, అత్తిలి మల్లికార్జున్‌ గౌడ్‌, ఆకుల హరికృష్ణ, శ్రీనివాస్‌గౌడ్‌, నాగులు, కిశోర్‌, ఆరీఫ్‌ పాల్గొన్నారు.

కమర్షియల్‌ నిర్మాణాలతో ట్రాఫిక్‌ సమస్య

లాలాపేట: జనవాసాల మధ్య కమర్షియల్‌ నిర్మాణాలకు అనుమతిస్తే పార్కింగ్‌ సమస్య తలెత్తుతుందని పలువురు తార్నాక కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈమేరకు నిబంధనలకు విరుద్ధంగా నిర్మిస్తున్న ఓ భవనం వద్ద సోమవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. తార్నాక లేన్‌ నంబర్‌-5, స్ట్రీట్‌ నంబర్‌-14 లో 200 గజాల స్థలంలో ఓ వ్యక్తి జీహెచ్‌ఎంసీ నుంచి జీ ప్లస్‌ టు రెసిడెన్షియల్‌కు అనుమతి తీసుకుని దానికి విరుద్ధంగా జీ ప్లస్‌ టు తో పాటు అదనపు అంతస్తు, ఓ పెంట్‌ హౌజ్‌ను నిర్మించారన్నారు. అంతేగాకుండా పార్కింగ్‌ స్థలంలో కమర్షియల్‌ కోసం 10 షట్టర్లు ఏర్పాటు చేశారన్నారు. ఈ విషయమై సంబంధిత బిల్డింగ్‌ యజమానితో మాట్లాడినా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారన్నారు. అంతేగాకుండా తార్నాక స్ట్రీట్‌ నంబర్‌-1 నుంచి నాచారం వెళ్లే స్ట్రీట్‌ నంబర్‌-14 రోడ్డు కోసం కేటాయించిన ప్రదేశాన్ని పార్కింగ్‌ కోసం ఆక్రమించాడని మండిపడ్డారు. ఈ విషయమై సికింద్రాబాద్‌ డిప్యూటీ కమిషనర్‌కు ఫిర్యాదు చేసినా చర్యలు తీసుకోలేదని ఇప్పటికైనా అధికారులు స్పందించాలని కోరారు. లేకుంటే కాలనీవాసులు అందరం కలిసి ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లడంతో పాటు న్యాయపోరాటం చేస్తామని హెచ్చరించారు. రిటైర్డు ఐపీఎస్‌ జగన్నాథరెడ్డి, డాక్టర్‌ రవీందర్‌రెడ్డి, రిటైర్డు సీఈఓ వెంకట్‌రెడ్డి, ఉపేందర్‌, సుశీల్‌ సింగ్‌, శివప్రసాద్‌, నరేందర్‌రెడ్డి ఉన్నారు.



కమర్షియల్‌ నిర్మాణం వద్ద నిరసనలో కాలనీవాసులు

ప్రభుత్వ పాఠశాలల్లో సోలార్‌ ఏర్పాటు చేయండి

ఎమ్మెల్యే శ్రీగణేష్‌

రాంగోపాల్‌పేట్‌: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యుత్‌ బిల్లులు నివారించేందుకు సోలార్‌ వ్యవస్థను ఏర్పాటు చేయాలని కంటోన్మెంట్‌ ఎమ్మెల్యే శ్రీగణేష్‌ కలెక్టర్‌ను కోరారు. సోమవారం రెజిమెంటల్‌బజార్‌లోని హిల్‌స్ట్రీట్‌ పాఠశాలను సందర్శించి అక్కడ నెలకొన్న సమస్యల గురించి అడిగి తెలుసుకున్నారు. అనంతరం విద్యుత్‌ బిల్లుల గురించి స్థానికులు ఆయన దృష్టికి తేవడంతో వెంటనే ఆయన కలెక్టర్‌తో మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలల్లో అనువుగా ఉన్న చోట సోలార్‌ సిస్టం ఏర్పాటు చేయడం వల్ల విద్యుత్‌ సమస్య ఉత్పన్నం కాదని తెలిపారు. దీన్ని వెంటనే పరిశీలించి చర్యలు తీసుకుంటామని కలెక్టర్‌ తెలిపారు. అలాగే కంటోన్మెంట్‌ ప్రాంతంలో బాలికల హోంతో పాటు బాలుర హోంను కూడా అభివృద్ధి చేయించేందుకు కృషి చేస్తామన్నారు. ఎలాంటి ఆధారం లేని వృద్ధులకు వృద్ధాశ్రమాలు ఏర్పాటు చేసి వారికి అండగా ఉండాల్సిన అవసరం ఉందన్నారు. దాని కోసం తన వంతు కృషి చేస్తానని తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్‌ నాయకులు సంతోష్‌ యాదవ్‌ తదితరులు పాల్గొన్నారు.



రెజిమెంటల్‌బజార్‌లోని హోంను సందర్శించిన ఎమ్మెల్యే శ్రీగణేష్‌

అనుమతుల్లేని సైరన్‌లు.. వాహనదారులపై కేసు నమోదు



తనిఖీలు నిర్వహిస్తున్న ట్రాఫిక్‌ పోలీసులు

అమీర్‌పేట: అనుమతులు లేని సైరన్‌లను పెట్టుకుని తిరుగుతున్న వాహనదారులపై ఎస్‌ఆర్‌నగర్‌ ట్రాఫిక్‌ పోలీసులు కేసులు నమోదు చేశారు. ఆదివారం రాత్రి ప్రత్యేక డ్రైవ్‌ నిర్వహించి దాదాపు 70కి పైగా ప్రైయివేట్‌ ట్రావెల్స్‌ బస్సులు, కార్లు, లారీల సైరన్లు జప్తు చేశారు. వాహన యజమానులకు జరిమానాలు విధించారు. బ్లాక్‌ ఫిల్మ్‌లు సైతం తొలగించారు. ప్రత్యేక తనిఖీలు నెల రోజుల పాటు ఉంటాయని, తాము పట్టుకునే లోగా వాహనదారులు వాటిని తొలగించుకోవాలని ఇన్‌స్పెక్టర్‌ సైదులు సూచించారు.

సన్‌షైన్‌ హాస్పిటల్‌లో సెల్ఫ్‌ డిఫెన్స్‌పై శిక్షణ

సనత్‌నగర్‌: మహిళలకు మానసిక స్థైర్యంతో పాటు శారీరక దృఢత్వం అవసరమని కిమ్స్‌ సన్‌షైన్‌ హాస్పిటల్‌ మేనేజింగ్‌ డైరెక్టర్‌, ప్రముఖ ఆర్థోపెడిక్‌ సర్జన్‌ డాక్టర్‌ గురువారెడ్డి అన్నారు. బేగంపేటలోని కిమ్స్‌ సన్‌షైన్‌ హాస్పిటల్‌లోని ఉద్యోగులు, నర్సింగ్‌ సిబ్బంది, డాక్టర్లకు సోమవారం నిర్వహించిన సెల్ఫ్‌ డిఫెన్స్‌ను గురువారెడ్డి ప్రారంభించి మాట్లాడారు. ఇటీవల మహిళలపై జరుగుతున్న దాడులు, ఇతరత్రా సంఘటలను దృష్టిలో పెట్టుకుని ప్రతి మహిళ తనను తాను కాపాడుకునేలా సెల్ఫ్‌ డిఫెన్స్‌ వర్క్‌షాప్‌ నిర్వహించడం జరిగిందన్నారు. మహిళలపై దాడి చేస్తే ప్రతిఘటించే విధానం తదితర అంశాలపై వారం రోజుల పాటు శిక్షణ తరగతులు నిర్వహించి సర్టిఫికెట్లను అందజేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో కార్డియాలజిస్ట్‌ డాక్టర్‌ కావ్య, న్యూరాలజిస్ట్‌ డాక్టర్‌ నివేదిత, నర్సింగ్‌ స్టాఫ్‌ పాల్గొన్నారు.



సెల్ఫ్‌ డిఫెన్స్‌ వర్క్‌షాప్‌లో కిమ్స్‌ సన్‌షైన్‌ ఉద్యోగులు

అక్రమ నిర్మాణం సీజ్‌

సీజ్‌ తొలగించడంపై సీఈఓ ఆగ్రహం

కంటోన్మెంట్‌: బోర్డు ఆదేశాలను బేఖాతరు చేస్తూ, సీజ్‌ తొలగించి చేపడుతున్న అక్రమ నిర్మాణంపై అధికారులు కొరడా ఝుళిపించారు. సదరు భవనాన్ని తిరిగి సీజ్‌ చేయడంతో పాటు బాధ్యులపై పోలీసులకు ఫిర్యాదు చేశారు. బోర్డు అధికారుల వివరాల ప్రకారం.. ఆరో వార్డు ఎల్‌ఐసీ కాలనీ ప్లాట్‌ నెంబర్‌-36లో జీ ప్లస్‌ వన్‌ అంతస్తులో నిర్మాణం ఉండేది. రెండేళ్ల క్రితం శ్రీనివాస్‌ అనే వ్యక్తి బోర్డు నుంచి ఎలాంటి అనుమతి లేకుండానే మరో రెండు అంతస్తుల నిర్మాణం చేపట్టాడు. నిర్మాణ సమయంలో ప్రమాదవశాత్తూ ఓ కూలీ భవనంపై నుంచి పడి మృతి చెందాడు. దీంతో పోలీసులు కేసు నమోదు చేయగా, బోర్డు అధికారులు సైతం చర్యలు చేపట్టారు. మూడు, నాలుగో అంతస్తులను సీజ్‌ చేశారు. తాజాగా భవన నిర్మాణదారులు బోర్డు అధికారుల సీజ్‌లను తొలగించి, తిరిగి నిర్మాణ పనులు చేపట్టారు. దీనిపై ఫిర్యాదు రావడంతో సీఈఓ మధుకర్‌నాయక్‌, గత వారం సదరు భవనాన్ని పరిశీలించి చర్యలు చేపట్టాల్సిందిగా ఇంజినీరింగ్‌ అధికారులను ఆదేశించారు. బోర్డు ఆదేశాలను ఏమాత్రం పట్టించుకోవడమే కాకుండా, ఏకంగా సీల్‌ తొలగించడం పట్ల సీఈఓ ఆగ్రహం వ్యక్తం చేశారు. బోర్డు సీజ్‌ను తొలగించిన వ్యక్తులపై కేసు నమోదు చేయాల్సిందిగా సూచించినట్లు, కంటోన్మెంట్‌ చీఫ్‌ ప్లానర్‌ ఫణికుమార్‌ వెల్లడించారు.



సమస్యల పరిష్కారానికి కృషి

రసూల్‌పురా: బస్తీల్లోని సమస్యల పరిష్కారానికి బోర్డు నిధులతో పాటు నియోజకవర్గ అభివృద్ధిక నిధులు కేటాయించనున్నట్లు కంటోన్మెంట్‌ ఎమ్మెల్యే శ్రీగణేష్‌ పేర్కొన్నారు. సోమవారం ఏడో వార్డు పరిధిలోని తిరుమలగిరి విలేజ్‌, వనిత సొసైటీ, వీరభద్ర స్వామి దేవాలయం వీధీ, సేయింట్‌ ఆంథోని చాపెల్‌ విధి, సగమాత చర్చి ప్రాంతాల్లో ఎమ్మెల్యే పర్యటించి స్థానికులతో మాట్లాడారు. భూగర్భ డ్రైనేజీ సమస్య, తాగునీటి, అంతర్గత రహదారుల అభివృద్ధి, నాలాల పూడిక తీత తదితర సమస్యలను పరిష్కరించాలని స్థానికులు ఎమ్మెల్యేను కోరారు. శిథిలావస్థకు చేరి కూలిన ఇళ్ల స్థానంలో ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయించాలని పలువురు మహిళలు ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు.



నిరుపయోగంగా



సనత్‌నగర్‌, అమీర్‌పేట ప్రాంతాల్లో ఇలా..



లూకేఫ్‌ కేంద్రాలు

- వ్యాపారాలకే పరిమితం
- మూతబడ్డ టాయిలెట్లు
- వినియోగంలోకి తేవాలంటున్న ప్రజలు
- విస్మరిస్తున్న అధికారులు

సనత్‌నగర్‌: ప్రధాన రహదారులు, రద్దీ ప్రాంతాలు, షాపింగ్‌ మాల్స్‌ సమీప ప్రాంతాల్లో బాటసారుల అవసరాల కోసం ఏర్పాటు చేసిన లూకేఫ్‌ కేంద్రాలు నిరుపయోగంగా మారుతున్నాయి. ఓ వైపు వ్యాపారం చేసుకోవడంతో పాటు మరోవైపు టాయిలెట్‌ సౌకర్యం కల్పించాలన్నదే ఈ కేంద్రం ముఖ్య ఉద్దేశం. ఈ సెంటర్లను దక్కించుకున్న వారు వ్యాపారం ద్వారా వచ్చే రాబడిలో కొంతభాగం ఈ టాయిలెట్ల నిర్వహణపై వెచ్చించాల్సి ఉంటుంది. కానీ ఇవి కేవలం వ్యాపార కేంద్రాలుగానే మారిపోగా, టాయిలెట్ల నిర్వహణ మాత్రం అటకెక్కింది. రూ. లక్షల్లో ఖర్చు చేసి లూకేఫ్‌ కేంద్రాలకు అనుబంధంగా ఏర్పాటు చేసిన టాయిలెట్లు నిర్వహణ సరిగా లేక నిరుపయోగంగా మారుతున్నాయి.సనత్‌నగర్‌, అమీర్‌పేట ప్రాంతాల్లో జీహెచ్‌ఎంసీ ఏర్పాటుచేసిన ఉచిత టాయిలెట్లు ఏ ఒక్కటీ అందుబాటులో లేకుండా పోయింది. ఫలితంగా బాటసారులు అత్యవసరమైతే ఉక్కబట్టుకుని ఉండాల్సిన దుస్థితి నెలకొంది. ముఖ్యంగా మహిళలు మరీ ఇబ్బందులు పడుతున్నారు. ప్రజాధనాన్ని వెచ్చించి ఎక్కడపడితే అక్కడ ఏర్పాటు చేశారు సరే..వాటి నిర్వహణను మాత్రం గాలికొదిలేశారని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

గాడితప్పిన లక్ష్యం..

ఓ వైపు నిరుద్యోగులకు ఉపాధి కల్పించడంతో పాటు మరోవైపు మూత్రశాలల సమస్య తీర్చేలా లూకేఫ్‌ కేంద్రాల ఏర్పాటుకు జీహెచ్‌ఎంసీ శ్రీకారం చుట్టింది. ఎర్రగడ్డ, ఈఎస్‌ఐ బస్టాప్‌, ఎస్సార్‌నగర్‌ కమ్యూనిటీహాల్‌, అమీర్‌పేట ధరంకరంరోడ్డులలో పెద్ద పెద్ద కంటైనర్‌లా ఉండే లూకేఫ్‌ కేంద్రాలను ఏర్పాటు చేశారు. కొంత కాలంలోనే అవి లక్ష్యానికి విరుద్ధంగా కేవలం వ్యాపార కేంద్రాలుగానే మిగిలిపోయాయి. వాస్తవానికి ఇక్కడ వ్యాపారం చేసుకునే వారు ఆయా కేంద్రాల్లో ఏర్పాటు చేసిన మదర్‌ ఫీడింగ్‌, షీ టాయిలెట్లను నిర్వహణ చూసుకోవాల్సిన బాధ్యత ఉంటుంది. వాటి నిర్వహణను మహిళా పొదుపు సంఘాల మహిళలకు అప్పగించింది. ప్రధాన రహదారుల్లో వ్యాపారాలు చేసుకునే వెసులుబాటు కల్పించడంతో వారు ఆర్థికంగా బలపడవచ్చన్న భరోసా కల్పించింది. ఇది బాగానే ఉన్నప్పటికీ కేవలం వ్యాపారానికి పరిమితమై బాటసారులైన మహిళల మూత్ర విసర్జ, బిడ్డలకు పాలు పట్టేందుకు ఏర్పాటు చేసిన మూత్రశాలలు, మదర్‌ ఫీడింగ్‌ కేంద్రాలు మూలన పడ్డాయనే చెప్పవచ్చు. ఎవరైనా అత్యవసరమైతే అక్కడికి వస్తే తాళం వేసి ఉండడమో లేదా నీటి సదుపాయం లేకపోవడమో వంటి కారణాలతో వెనుదిరుగుతున్నారు.



పర్యవేక్షణ లేక..

ఈ కేంద్రాల నిర్వహణ ఏ విధంగా జరుగుతుంది.. వాటి ఫలితాలు ఏవిధంగా ఉన్నాయి..అనే విషయాలపై పర్యవేక్షించాల్సిన అధికార యంత్రాంగం చూసీచూడనట్లుగా వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. గతంలో కేంద్రాల నిర్వాహకుల తీరుపై పలు ఫిర్యాదులు వస్తే నోటీసులు జారీ చేస్తామన్న అధికారులు ఆచరణలో మాత్రం విఫలమయ్యారన్న వార్తలు వినిపిస్తున్నాయి. అసలు లూకేఫ్‌ కేంద్రాలు అర్హులకు అందాయా? లేక తీసుకున్న వారు మరొకరికి లీజుకు ఇచ్చుకున్నారా? అన్న విషయాలపై కూడా ఆరా తీయాల్సి ఉంది. అవేమీ పట్టనట్లుగా వ్యాపారాలకే లూకేఫ్‌ కేంద్రాలు అన్నట్లుగా మారిపోయాయి.

గతంలోనూ అంతే..

బీఆర్‌ఎస్‌ ప్రభుత్వ హయాంలో గత కొన్నేళ్ల క్రితం ఏర్పాటు చేసిన షీ టాయిలెట్లు మూలనపడ్డాయి. ప్రత్యేకంగా మహిళల కోసమంటూ సనత్‌నగర్‌ పారిశ్రామికవాడ, అమీర్‌పేట మైత్రీవనం, శ్యాంకరణ్‌రోడ్డులోని దివ్యశక్తి అపార్ట్‌మెంట్‌ తదితర ప్రాంతాల్లో లక్షలాది రూపాయలు వెచ్చించి వీటిని ఏర్పాటుచేశారు. అయితే కొద్ది రోజులుగా వాటి నిర్వహణ లేక మూతపడ్డాయి. ముఖ్యంగా నీటి వసతి, కరెంటు సదుపాయం లేక అవి కాస్తా మూన్నాళ్ల ముచ్చటగానే మారిపోయాయి. ఉన్నతాధికారులు స్పందించి ఈ కేంద్రాల నిర్వహణ సక్రమంగా జరిగేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

ఓయూకు రూ.1000 కోట్లు కేటాయించాలి

ఉస్మానియా యూనివర్సిటీ: వచ్చే బడ్జెట్‌లో ఓయూకు రూ. 1000 కోట్లు కేటాయించాలని విద్యార్థి నేతలు, అధ్యాపకులు డిమాండ్‌ చేశారు. ఆర్ట్స్‌ కాలేజీ 57వ తరగతి గదిలో సోమవారం విద్యార్థుల సదస్సు జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఖాళీగా ఉన్న అధ్యాపకుల పోస్టులు భర్తీ చేయాలని, పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్‌లు విడుదల చేయాలని, వర్సిటీలో విద్యార్థి సంఘాల ఎన్నికలు నిర్వహించాలని కోరారు. ప్రిన్సిపాల్‌ ప్రొ.కాశీం, వైస్‌ ప్రిన్సిపాల్‌ ప్రొ. కొండ నాగేశ్వర్‌, ప్రొ.రాహెషెఫర్డ్‌, ప్రొ.వంశీధర్‌ తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని ఓయూ వీసీకి వినతి



ఉస్మానియా యూనివర్సిటీ: సమస్యలు పరిష్కరించాలని కోరుతూ పలు విద్యార్థి సంఘాల నేతలు ఓయూ వీసీ ప్రొ.కుమార్‌కు సోమవారం వినతి పత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ.. పీహెచ్‌డీ సీట్లు పెంచాలని, రిటైర్డ్‌ ప్రొఫెసర్లకు రీసెర్చ్‌ సెంటర్స్‌, పీజీ సెంటర్స్‌ అధ్యాపకులకు సైతం గైడ్‌షిప్‌ ఇవ్వాలన్నారు. ప్రొఫెసర్ల రిటైర్మెంట్‌ను 65 ఏండ్లకు పెంచడంతో పీహెచ్‌డీ సీట్ల సంఖ్యను కూడా పెంచి రీనోటిఫికేషన్‌ వేయాలని కోరారు. వివిధ విద్యార్థి సంఘాల నాయకులు పాల్గొన్నారు.

నీటి ఎద్దడి నివారణకు చర్యలు తీసుకోవాలి

అడ్డగుట్ట: వేసవి దృష్ట్యా డివిజన్‌లో నీటి ఎద్దడి తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని బీజేపీ డివిజన్‌ అధ్యక్షురాలు గాజుల సౌందర్య కోరారు. ఈ మేరకు జలమండలి జీఎం వినోద్‌కుమార్‌ను సికింద్రాబాద్‌లోని ఆయన కార్యాలయంలో సోమవారం కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. అడ్డగుట్టలోని అనేక ప్రాంతాల్లో పవర్‌బోర్‌ వాటర్‌ ట్యాంక్‌లు శిథిలావస్థకు చేరాయన్నారు. మరమ్మతులకు నోచుకోక స్థానికులు ఇబ్బందులు పడుతున్నారని వెంటనే అందుబాటులోకి తేవాలని కోరారు. అదేవిధంగా తుకారాంగేట్‌ రియోపాయింట్‌ నుంచి సుభాష్‌ బొమ్మ వరకు నూతనంగా ఏర్పాటు చేస్తున్న తాగునీటి పైప్‌లైన్‌కు మూడు చోట్ల టీ జంక్షన్లు పెడితే చుట్టుపక్కల ఉన్న సాయినగర్‌, వెంకట్‌నగర్‌, సాయిబాబా ఆలయ ప్రాంతం, కేజీ హాస్పిటల్‌, ముత్యాలమ్మ ఆలయ తదితర ప్రాంతాలకు మెరుగైన నీటి సరఫరా అవుతుందన్నారు. నేతలు కృష్ణ, హంసరాజు, శివలింగం, రాజేశ్‌ పాల్గొన్నారు.



జీఎం వినోద్‌కుమార్‌కు వినతిపత్రం అందజేస్తున్న బీజేపీ నేతలు

మానసికోల్లాసానికి క్రీడలు దోహదం



ట్రోఫీ అందజేస్తున్న ఎమ్మెల్యే తలసాని

అమీర్‌పేట: మానసికోల్లాసానికి క్రీడలు దోహదపడుతాయని సనత్‌నగర్‌ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్‌ అన్నారు.అమీర్‌పేట మున్సిపల్‌ గ్రౌండ్‌లో ఐదు రోజులుగా నిర్వహించిన క్రీడా పోటీలు సోమవారంతో ముగిశాయి.ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరై విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఏప్రిల్‌ 14న బైసాకి (సిక్కుమతం స్థాపించిన రోజు) సందర్భంగా ప్రతి సంవత్సరం క్రీడా పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. నగరంలోని వివిధ ప్రాంతాలకు చెందిన సిక్కు సోదరులు పోటీలకు హాజరయ్యారన్నారు. క్రికెట్‌లో అమీర్‌పేట రాయల్‌ చాలెంజర్స్‌ టీమ్‌ విన్నర్‌, కిషన్‌బాగ్‌కు చెందిన టీమ్‌ రన్నరగా నిలిచాయి. ఈ కార్యక్రమంలో నామన సంతోష్‌ మణికుమార్‌, ప్రవీణ్‌రెడ్డి,సుమిత్‌సింగ్‌, గురుద్వారా అధ్యక్షులు దర్శన్‌సింగ్‌, కార్యదర్శి సురేందర్‌సింగ్‌, మాంటి, నరేందర్‌, పప్పు, సోను పాల్గొన్నారు.

ఒకటే పని.. ప్రారంభోత్సవాలు రెండు

- భవానీనగర్‌లో సీసీ రోడ్డు పనుల విషయంలో స్వల్ప ఉద్రిక్తత
- బీఆర్‌ఎస్‌, కాంగ్రెస్‌ శ్రేణుల పోటాపోటీ నినాదాలు
- ఇదేమి చోద్యమంటూ ముక్కున వేలేసుకున్న ప్రజలు

చిలకలగూడ : ఒకటే పని.. రెండు ప్రారంభోత్సవాలు..దీనిని చూసిన ప్రజలు ఇదేమి చోద్యమంటూ ముక్కున వేలేసుకున్న ఘటన సీతాఫల్‌మండి డివిజన్‌ భవానీనగర్‌లో సోమవారం జరిగింది. స్థానిక ఎమ్మెల్యే పద్మారావుగౌడ్‌, కార్పొరేటర్‌ సామల హేమ భవానీనగర్‌లో రూ. 20 లక్షల వ్యయంతో చేపడుతున్న సీసీ రోడ్డు పనులను సోమవారం ప్రారంభించాలని నిర్ణయించారు. ఈ విషయం తెలుసుకున్న కాంగ్రెస్‌ నాయకులు ఎమ్మెల్యే రాకముందే భవానీనగర్‌కు చేరుకుని జై కాంగ్రెస్‌ నినాదాలు చేసి అక్కడి నుంచి వెళ్లిపోయారు. కొన్నిసేపటి తర్వాత ఎమ్మెల్యే పద్మారావు, కార్పొరేటర్‌ హేమ బీఆర్‌ఎస్‌ నాయకులు, కార్యకర్తలతో కలిసి భవానీనగర్‌ చేరుకుని కొబ్బరికాయలు కొట్టి పనులు ప్రారంభించారు. అదే సమయంలో కాంగ్రెస్‌ నాయకులు మళ్లీ వచ్చి జై కాంగ్రెస్‌ అంటు.. బీఆర్‌ఎస్‌ నాయకులు జై పజ్జన్న, జై బీఆర్‌ఎస్‌ అంటు నినాదాలు చేయడంతో స్వల్ప ఉద్రిక్తత చోటు చేసుకుంది. అనంతరం బీఆర్‌ఎస్‌ శ్రేణులు వెళ్లిపోయిన తర్వాత అదే ప్రాంతంలో కాంగ్రెస్‌ నాయకులు టెంకాయలు కొట్టి మరో మారు పనులు ప్రారంభించడం విశేషం. ఏదైతేనేం పనులు సజావుగా జరిగి రహదారి అందుబాటులోకి వస్తే చాలంటూ స్థానికులు చర్చించుకోవడం గమనార్హం.



భవానీనగర్‌లో సీసీ రోడ్డు పనులు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే పద్మారావు, కార్పొరేటర్‌ హేమ

అభివృద్ధి కొనసాగిస్తాం : పద్మారావుగౌడ్‌, ఎమ్మెల్యే, సికింద్రాబాద్‌

ఎవరూ అడ్డుపడినా నియోజకవర్గ అభివృద్ధి కొనసాగిస్తానని భవానీనగర్‌ సీసీ రోడ్డు పనుల ప్రారంభోత్సవంలో ఎమ్మెల్యే పద్మారావు అన్నారు. కార్పొరేటర్‌ సామల హేమ, జీహెచ్‌ఎంసీ, జలమండలి, రెవెన్యూ అధికారులు విద్యాసాగర్‌, స్వర్ణలత, కౌశిక్‌, కుశాల్‌తోపాటు బీఆర్‌ఎస్‌ నాయకులు, కార్యకర్తలు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.



భవానీనగర్‌లో సీసీ రోడ్డు పనులు ప్రారంభిస్తున్న కాంగ్రెస్‌ నాయకులు

నిధులు మంజూరు చేయిస్తున్నాం : జలంధర్‌రెడ్డి, కాంగ్రెస్‌ నాయకుడు

సికింద్రాబాద్‌ కాంగ్రెస్‌ ఇన్‌చార్జి ఆదం సంతోష్‌ కుమార్‌ సీఎం రేవంత్‌రెడ్డితో మాట్లాడి నిధులు మంజూరు చేయించినట్లు రోడ్డు పనుల ప్రారంభోత్సవంలో కాంగ్రెస్‌ నాయకుడు మాదిరెడ్డి జలంధర్‌రెడ్డి తెలిపారు. కాంగ్రెస్‌ ప్రభుత్వం కేటాయించిన నిధులతో చేపట్టిన అభివృద్ధి పనుల్లో తాము పాల్గొన్నామని, ప్రజా సమస్యలపై కూడా స్పందిస్తామన్నారు. కాంగ్రెస్‌ నాయకులు సందీప్‌, అమర్నాథ్‌గౌడ్‌, అనిల్‌, గుంటి కృష్ణ, బ్రహ్మజీ, శంకర్‌, చందర్‌, పాపాలాల్‌, బబ్లూ, సురేశ్‌, జగన్‌రెడ్డి, రాచందర్‌, శోభ, కుద్దూస్‌ఖాన్‌ పాల్గొన్నారు.

నేడు విద్యుత్‌ ఉండని ప్రాంతాలు

రసూల్‌పురా: విద్యుత్‌ మరమ్మతు పనుల కారణంగా జింఖానా సబ్‌స్టేషన్‌ పరిధిలో సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏడీఈ మురళి కృష్ణ పేర్కొన్నారు. ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు.. బీహెచ్‌ఈఎల్‌ ఎన్‌క్లేవ్‌, పరేడ్‌ గ్రౌండ్‌, మడ్‌ఫోర్ట్‌, విక్రంపురి, సిక్‌ విలేజ్‌, లక్ష్మినగర్‌, బాలంరాయి, అపోలో హాస్పిటల్‌, తాడ్‌బండ్‌. మధ్యాహ్నం 3 గంటల నుంచి సాయంత్రం 5 వరకు తాడ్‌బండ్‌, గన్‌రాక్‌ కాలనీ, ఏ, బీ సీ, సూర్యనగర్‌, కౌసల్య, అమరావతి, అవంతి, వాసవీనగర్‌ కాలనీలతో పాటు కార్ఖాన ప్రాంతాల్లో విద్యుత్‌ ఉండదన్నారు.

రేపు ఉద్యోగమేళా

సనత్‌నగర్‌: రంగారెడ్డి జిల్లా ఉపాధి కల్పనా కార్యాలయం, దిశా స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ఈ నెల 12న ఎర్రగడ్డ రైతుబజార్‌ ఎదురుగా గల సెయింట్‌ థెరిస్సా చర్చి ప్రాంగణంలో ఉద్యోగ మేళాను నిర్వహిస్తున్నట్లు దిశ డైరెక్టర్‌ జస్టిన్‌, సమన్వయకర్తలు ఐవన్‌వాజ్‌, కార్తీక్‌, బీఎస్‌కే డైరెక్టర్‌ శరత్‌ తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పది, ఇంటర్‌, డిగ్రీ, ఐటీఐ, డిప్లొమా, బీ అండ్‌ ఎం ఫార్మసీ, బీఈడీ చదివిన వారు హాజరుకావచ్చని మరిన్ని వివరాలకు 83101 33469, 98482 73301 నంబర్లలో సంప్రదించాలన్నారు.

కరాటేపై ఆసక్తి చూపాలి



శంకర్‌కు బెల్ట్‌ ప్రదానం చేస్తున్న కోచ్‌

అమీర్‌పేట: ఆత్మరక్షణ విద్యపట్ల ప్రతి ఒక్కరు ఆసక్తి కనబర్చాలని కరాటే మాస్టర్‌ మురళీధర్‌ ముదిరాజ్‌ అన్నారు. అమీర్‌పేట గురుగోవింద్‌ సింగ్‌ మున్సిపల్‌ స్పోర్ట్స్‌ కాంప్లెక్స్‌లో జరిగిన పోటీల్లో గోసేల కుమారస్వామి కుమారుడు శంకర్‌ ముదిరాజ్‌ ప్రతిభ కనబరిచి పర్పుల్‌ బెల్ట్‌ గెలుచుకున్నారు. ఈ సందర్భంగా కోచ్‌ మురళీధర్‌ మాట్లాడుతూ.. ప్రస్తుతం ఏడో తరగతి చదువుతున్న శంకర్‌ చిన్ననాటి నుండి కరాటేపై ఆసక్తితో ఉన్నాడన్నారు. మార్షల్‌ ఆర్ట్స్‌ నేర్చుకోవడం ద్వారా తమను తాము రక్షించుకోవడంతో పాటు ఇతరులకు రక్షణ కల్పించే మానసిక ధైర్యం ఏర్పడుతుందన్నారు.

హుండీ ఆదాయం లెక్కింపు

అమీర్‌పేట : బల్కంపేట ఎల్లమ్మ ఆలయ హుండీల ఆదాయాన్ని సోమవారం లెక్కించారు. రూ.57,63,161 ఆదాయం సమకూరిందని అధికారులు తెలిపారు. అన్నదాన రూపంలో రూ.1,41,923, 1542 అమెరికా డాలర్స్‌, 5 బ్రిటన్‌ పౌండ్స్‌, 28 సింగపూర్‌ డాలర్స్‌, 30 ఆస్ట్రేలియా డాలర్స్‌, 5 రియాల్స్‌ వచ్చాయన్నారు. కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వాహణ అధికారి బి.కృష్ణ, చైర్మన్‌ సాయిబాబాగౌడ్‌, దేవాదాయ శాఖ ఇన్‌స్పెక్టర్‌ శ్రీదేవి, దాతలు పాల్గొన్నారు.

రిటైర్డు ఉద్యోగులను తొలగించండి

ఉస్మానియా యూనివర్సిటీ: రాష్ట్రంలోని వివిధ శాఖల్లో పని చేస్తున్న 1050 రిటైర్డు ఉద్యోగులను తొలగించాలని తెలంగాణ స్టూడెంట్స్‌ అసోసియేషన్‌ (టీఎస్‌ఏ) రాష్ట్ర అధ్యక్షుడు ఎస్‌ఎం. శ్రీకాంత్‌యాదవ్‌ డిమాండ్‌ చేశారు. ఓయూ ఆర్ట్స్‌ కాలేజీ న్యూసెమినార్‌లో సోమవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. రిటైర్డు ఉద్యోగుల వలన నిరుద్యోగులకు అన్యాయం జరుగుతుందన్నారు. అంతేగాకుండా వేతనంతో పాటు పింఛన్‌, ఇతర అలవెన్సుల ఇవ్వడం వల్ల ప్రభుత్వంపై అదనపు భారం పడుతుందన్నారు. కాంగ్రెస్‌ ప్రభుత్వం ఏర్పడి 14 నెలలు గడుస్తున్న ఇంత వరకు వారిని తొలగించకపోవడం దారుణమన్నారు. కార్యక్రమంలో రామ్‌కిషన్‌, మురళీకృష్ణ, రంజిత్‌ వర్మ, కార్తీక్‌ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ పటిష్టతకు కృషి చేయాలి

సనత్‌నగర్‌: బీజేపీ మహంకాళి సికింద్రాబాద్‌ జిల్లా అధ్యక్షుడిగా నియమితులైన భరత్‌గౌడ్‌ సోమవారం మాజీ ఎమ్మెల్యే మర్రి శశిధర్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. శశిధర్‌రెడ్డి మాట్లాడుతూ.. జిల్లాలో అందరి నాయకులను సమన్వయం చేసుకుంటూ పార్టీ పటిష్టతకు కృషి చేయాలన్నారు. అన్ని కమిటీలను ఏర్పాటు చేసుకుని ఐకమత్యంగా ముందుకు వెళ్లాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం తీసుకునే ప్రజా వ్యతిరేక నిర్ణయాలపై ఎప్పటికప్పుడు పోరాటం చేస్తూ జిల్లాలో పార్టీని పటిష్టం చేస్తూ రాబోయే జీహెచ్‌ఎంసీ ఎన్నికలకు సమాయత్తం కావాలన్నారు. ఈ కార్యక్రమంలో నర్సింగ్‌యాదవ్‌, దయానంద్‌, శ్రీనివాస్‌గౌడ్‌, నరేందర్‌, ప్రవీణ్‌కుమార్‌, శ్రీనివాస్‌రెడ్డి, వంశీకృష్ణ, నెమలి ఆనంద్‌, మహేష్‌కుమార్‌, సంతోష్‌, ఎంఆర్‌ బాలకృష్ణ, దయానంద్‌రావు, సురేష్‌వర్మ, సందీప్‌వర్మ, అంబాల ఈశ్వర్‌బాబు, కిరీటా, వికాస్‌ పాల్గొన్నారు.

సైబర్‌ నేరగాళ్లతో జాగ్రత్తగా ఉండాలి

రాంగోపాల్‌పేట్‌: సైబర్‌ నేరగాళ్ల పట్ల జాగ్రత్తగా ఉండాలని మహంకాళి ఇన్‌స్పెక్టర్‌ పరశురాం సూచించారు. సోమవారం తపస్య జూనియర్‌ కాలేజీలో విద్యార్థులకు సైబర్‌ నేరాలపై అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ..గుర్తు తెలియని వ్యక్తులకు ఓటీపీలు చెప్పరాదన్నారు. సోషల్‌ మీడియా ద్వారా బాలికలు, యువతులను సైబర్‌ నేరగాళ్లు మోసం చేస్తూ వాళ్ల ఉచ్చులో పడేస్తున్నారని వీడియో కాల్స్‌ ద్వారా డిజిటల్‌ అరెస్టుల పేరుతో భయభ్రాంతులకు గురిచేసి రూ.లక్షల్లో దోచుకుంటున్నారన్నారు.